# ఖరీఫ్‌కు సిద్ధం!



- వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న రైతులు
- విత్తనాలు, ఎరువులు సమకూర్చడంలో నిమగ్నమైన అధికారులు
- అందుబాటులో 5,985 క్వింటాళ్ల వరి విత్తనాలు
- రాయితీపై విత్తనాల పంపిణీకి చర్యలు

**బొబ్బిలి:** ఖరీఫ్ సాగుకు ఇటు రైతులు అటు అధికారులు సన్నద్ధమవుతున్నారు. సీజన్ ప్రారంభం కావస్తుండడంతో అన్నదాతలు వ్యవసాయ పనులకు సన్నాహాలు చేస్తుండగా, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సమకూర్చడంలో అధికారులు నిమగ్నమయ్యారు. కొన్నిరోజులుగా ఖరీఫ్ ప్రణాళికలు తయారు చేయడంలో బిజీబిజీగా ఉన్న అధికారులు ఇప్పుడు పచ్చిరొట్ట, వరి విత్తనాలతో పాటు ఎరువులు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలకు విత్తనాలు, ఎరువులు వచ్చి, చేరాయి. బొబ్బిలి డివిజన్‌కు సంబంధించి, మొత్తం 5,985 క్వింటాళ్ల వరి విత్తనాలను పంపిణీకి సిద్ధం చేశారు. వీటిని ప్రభుత్వం నిర్దేశించిన ధరకు రాయితీపై అందించేందుకు అన్నివిధాలా చర్యలు ఊపందుకున్నాయి. మొత్తం 9 రకాల వరి విత్తనాల్లో రకాన్ని బట్టి 25, 30 కిలోల బస్తాలను అందజేయనున్నారు. రైతులకు అందించేందుకు బొబ్బిలి మండలానికి 1883 క్వింటాళ్లు, బాడంగి మండలానికి 1310 క్వింటాళ్లు, తెర్లాం మండలానికి 1944 క్వింటాళ్లు, రామభద్రపురం మండలానికి 848 క్వింటాళ్ల విత్తనాలను కేటాయించారు. అందుబాటులోని విత్తనాలు వాటి ధరలను పట్టికలో చూడొచ్చు.

**నేలసారవంతానికి 'పచ్చిరొట్ట'..**

ఎరువులు, వరి విత్తనాలతో పాటు నేలసారవంతానికి ఉపయోగపడే పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందర్ తెలిపారు. పిల్లిపెసర, కట్టెజనుము వంటి పచ్చిరొట్ట విత్తనాలు పొలాల్లో వేసుకుని, అవి మొక్కలైన తర్వాత నేలలో కలియదున్నుకుంటే భూసారం పెరిగి, ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పచ్చిరొట్ట సాగుకు కూడా రైతులు ఉత్సాహం కనబరుస్తుండం విశేషం. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందస్తు వ్యవసాయ ప్రణాళికలు, సాగు సన్నాహాలు చేయడం వాటికి అనుగుణంగా అధికార యంత్రాంగం చేపడుతున్న చర్యలు ఉపకరిస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జూన్ నెలలోనే నైరుతి రుతుపవనాల కారణంగా సకాలంలో వర్షాలు కురిస్తే పంటలు ఆశాజనకంగా ఉంటాయని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

| విత్తన రకం | కిలోలు | ధర |
|---|---|---|
| 1.బీపీటీ 5204 | 25 | 795 |
| 2.ఎంటీయూ 1224 | 25 | 795 |
| 3.ఆర్‌జీఎల్ 2537 | 30 | 954 |
| 4.బీపీటీ 3291 | 30 | 834 |
| 5.ఎంటీయూ 1064 | 30 | 894 |
| 6.ఎంటీయూ 7029 | 30 | 894 |
| 7.ఎంటీయూ 1121 | 30 | 894 |
| 8.ఎంటీయూ 1318 | 30 | 894 |
| 9.ఆర్ఎన్ఆర్ 15048 | 25 | 795 |



ఆర్‌బీకే వద్ద సిద్ధంగా వరి విత్తనాల బస్తాలు

## క్లుప్తంగా

### 29న ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవానికి ముస్తాబైన ఆలయం

**రాజాం:** మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేటలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఈ నెల 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ముద్దన సత్యారావు విలేకరులకు సోమవారం తెలిపారు. బుధవారం జరిగే కార్యక్రమాల్లో ఉదయం పూజలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం తిరువీధి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదే కార్యక్రమానికి అమలాపురం లక్ష్మీ సమేత దత్తపీఠం స్వామీజీ దత్తసాయి మహరాజ్, కర్నూల్‌కు చెందిన స్వాత్మానంద స్వామీజీ తదితరులు హాజరు కానున్నారన్నారు.

### అరటి సాగుపై రైతుల ఆసక్తి



గార్రాజుచీపురుపల్లి సమీపంలో సాగు చేస్తున్న అరటి పంట

**రాజాం:** అరటి సాగుపై మండలంలోని రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. సోపేరు, రాజయ్యపేట, బొద్దాం, గార్రాజుచీపురుపల్లి గ్రామాల సమీపంలో అరటి సాగు విస్తృతంగా చేపడుతున్నారు. మండలంలో మొత్తం 180 ఎకరాల్లో అరటి పంట సాగులో ఉంది. చేతికి అందివచ్చిన అరటి గెలలను రాజాం మార్కెట్‌కు తరలించి, విక్రయిస్తున్నారు.

### కందుకూరికి ఘననివాళి



కందుకూరి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

**తెర్లాం:** స్థానిక శాఖా గ్రంథాలయంలో కందుకూరి వీరేశలింగం పంతులు 105వ వర్ధంతి సోమవారం నిర్వహించారు. లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి, విద్యార్థులు, పాఠకులు కలిసి కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమాజంలో స్త్రీవిద్యకు, బాల్యవివాహాల నిర్మూలనకు వీరేశలింగం పంతులు చేసిన సేవలను కొనియాడారు. వితంతు పునర్వివాహానికి ఆయన ఎంతగానో కృషి చేశారని, ఆయన ఆశయ సాధనకు నేటి యువత, విద్యార్థులు కూడా పాటుపడాలని వక్తలు కోరారు.

### దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



మాధవబజార్‌లోని ఓ దుకాణంలో తనిఖీలు చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

**రాజాం:** స్థానిక పట్టణంలోని మాధవబజారులో ఉన్న పలు దుకాణాల్లో రాజాం మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిషేధిత పాలిథిన్ సంచులు విక్రయిస్తున్నదీ లేనిదీ పరిశీలించారు. ప్రభుత్వం నిషేధించిన పాలిథిన్ సంచులను విక్రయిస్తూ పట్టుబడిన పలువురిపై కేసులు నమోదు చేశారు.

### ఓట్ల లెక్కింపునకు పటిష్ట చర్యలు

- ఆర్‌డీవో ఎ.సాయిశ్రీ



మాట్లాడుతున్న ఆర్‌డీవో సాయిశ్రీ

**బొబ్బిలి:** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డీవో ఎ.సాయిశ్రీ తెలిపారు. ఇదే విషయమై సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆమె.. నియోజకవర్గానికి సంబంధించిన ఓట్లను జూన్ 4వ తేదీన జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ గురజాడ యూనివర్సిటీలో లెక్కించడం జరుగుతుందని, ఉదయం 8 గంటలకే లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్లు ఓట్లు లెక్కిస్తారని, ఆ తర్వాత ఈవీఎంల ఓట్లు లెక్కిస్తారన్నారు. మొత్తం 14 టేబుళ్లలో 19 రౌండ్లు పాటు లెక్కింపు జరుగుతుందన్నారు. ఒక్కో టేబుల్ వద్ద ఒక సూపర్‌వైజర్, అసిస్టెంట్ ఉంటారన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఉంటుందన్నారు. కౌంటింగ్ కేంద్రం దగ్గరలోనే మీడియా పాయింట్ కూడా ఏర్పాటు చేస్తారన్నారు.

## ఎంపీ పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ బెల్లాన, జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు

**సంతకవిటి:** మండలంలోని వాసుదేవపట్నం సర్పంచ్ పప్పల గణపతిరావు చిన్న తమ్ముడు సత్యనారాయణ(అన్నంనాయుడు) ఇటీవల మరణించగా, ఆ గ్రామానికి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సోమవారం వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మృతికి గల కారణాలను ఎంపీ అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఎంపీ వెంట జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు జి.కేసరి, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, తాలాడ ఎంపీటీసీ కె.సన్యాసినాయుడు, సర్పంచ్‌లు వి.రమణ, డి.దాలినాయుడు, పి.ఈశ్వరరావు, కె.వి.నాయుడు, జి.జగన్మోహనరావు, ఎన్ని శ్రీను తదితరులు ఉన్నారు.

## 'చదవడం మాకిష్టం'



కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

**రామభద్రపురం:** వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో సోమవారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి విచ్చేసిన చిన్నారులతో లైబ్రేరియన్ సత్యవాణి.. కథల పుస్తకాలు, అబ్దుల్ కలాం, అక్బరు, బాబరు, దేశ నాయకుల చరిత్ర పుస్తకాలను చదివించారు. అనంతరం పుస్తకాలు చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతిరోజూ ఏదో ఒక మంచి పుస్తకం చదివితే మంచి విషయాలు తెలియడంతో పాటు అపారమైన జ్ఞానం కలుగుతుందని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించండి

**తెర్లాం:** బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని మండలంలోని లింగాపురం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు తవిటినాయుడు, సతివాడ ఉపాధ్యాయుడు సత్యనారాయణ కోరారు. సోమవారం మండలంలోని లింగాపురం గ్రామంలో ఇంటింటికీ వెళ్లిన వారు.. పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ప్రభుత్వ సదుపాయాలపై అవగాహన కల్పించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, నాణ్యమైన విద్యతో పాటు విద్యాసామగ్రి కూడా అందజేయడం జరుగుతోందని తెలిపారు.

## వరి, పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం



రైతులతో సమావేశమైన ఏవో శిరీష

**బాడంగి:** మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన వరి, పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏవో కె.శిరీష తెలిపారు. మండలంలోని బొత్సవానివలస గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతులతో సోమవారం సమావేశమైన ఆమె.. ఎంటీయూ 1121 రకం వరి విత్తనాలు 900 క్వింటాళ్లు, ఎంటీయూ 1064 రకం వరి విత్తనాలు 40 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని, విత్తనాల కోసం ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకే రాయితీపై విత్తనాలు అందిస్తామన్నారు.

## వివాదాస్పద వ్యాఖ్యలు చేసుకోవద్దు



సంతకవిటి: చిత్తారపురంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ షేక్ శంకర్

**సంతకవిటి:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎవరూ ఒకరిపై మరొకరు వివాదాస్పద వ్యాఖ్యలు చేసుకోవద్దని ఎస్ఐ షేక్ శంకర్ సూచించారు. మండలంలోని చిత్తారపురం, గోళ్లవలస, వాసుదేవపట్నం గ్రామాల్లో సోమవారం పర్యటించిన ఆయన.. ఆయా గ్రామాల ప్రజలతో సమావేశమై, ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్‌లు వేస్తున్నట్లు సమాచారం అందుతోందని, ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పదంగా ఎవరైనా గ్రామాల్లో సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

**బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు**



రేగిడి: దేవుదళ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసరావు

**రేగిడి:** ఎన్నికల ఫలితాల నేపథ్యంలో బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని దేవుదళ, గోపింపేట గ్రామాల్లో సోమవారం పర్యటించిన ఆయన.. పార్టీల గెలుపోటములపై బెట్టింగులు వేయవద్దని, అలాగే ఎవరూ గొడవలు పడవద్దని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుప్పిలి గవరయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిందాల్ కార్మికులకు అండగా సీఐటీయూ

**కొత్తవలస:** అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని జిందాల్ స్టెయిన్‌లెస్‌స్టీల్ కర్మాగార కార్మికులకు న్యాయం జరిగే వరకు సీఐటీయూ, అనుబంధ కార్మిక సంఘాలు అండగా ఉంటాయని సీఐటీ యూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాములమ్మ తెలిపారు. ఈనెల 17వ తేదీన జిందాల్ కర్మాగారం లే ఆఫ్‌ను ప్రకటించడంతో నుంచి కర్మాగారం ప్రధాన గేటు వద్ద కార్మికులు నిరసన తెలుపుతున్నా రు.కార్మికుల దీక్షా శిబిరాన్ని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాములమ్మ సోమవారం సందర్శించి తన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లే ఆఫ్‌ను ఎత్తేయాలని కార్మికులు చేస్తున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కర్మాగారాల యాజమాన్యాలకు కార్మికులపై చిన్నచూపు తగదన్నారు. జిందాల్ కర్మాగారం తక్షణమే లే ఆఫ్ ఎత్తేయాలని,కార్మికులకు పూర్తి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 29వ తేదీన లేబర్ కమిషన్ వద్ద జరగనున్న చర్చల్లో యాజమాన్యం సానుకూలంగా స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఆయుర్వేద వైద్య శిబిరం



రోగులకు అందిస్తున్న ఆయుర్వేద మందులు చూపిస్తున్న వైద్యాధికారి సునీల్‌కుమార్

**రేగిడి:** మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఆయుర్వేద వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్ శిబిరానికి వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చిన రోగులకు మందులు ఉచితంగా అందజేశారు. అనంతరం మంచి ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. దీర్ఘకాలిక రోగాలను నయం చేసేందుకు ఆయుర్వేద వైద్యం ఎంతో ఉపయోగపడుతుందని, నడుము, కీళ్ల నొప్పుల నివారణకు ఆయుర్వేదంలో మంచి మందులు ఉన్నాయని తెలిపారు. ప్రకృతిలో లభించే ఔషధ గుణాలు కలిగిన తులసి, వేప, తిప్పతీగ, ఉసిరి వంట వాటితో ఈ మందులు తయారవుతాయని, ఇవి వేసుకోవడం ద్వారా ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. గర్భిణులు, చిన్నారులకు కూడా అవసరమైన వారికి ఆయుర్వేద మందులు అందజేశారు.

## ఘనజీవామృతం తయారీపై అవగాహన



ఘనజీవామృతం తయారు చేయిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

**సంతకవిటి:** మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ఘనజీవామృతం తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలతో రైతు బొంగు అప్పలనరసయ్య 200 కిలోల ఘనజీవామృతం తయారు చేశారు. ఎకరాకు 400 కిలోల ఆవుపేడ, 10 లీటర్ల ఆవు మూత్రం, 2 కిలోల బెల్లం, 2 కిలోల పప్పుపిండి, గుప్పెడు పుట్టమన్ను కలిపిన మిశ్రమాన్ని ఉండలుగా చేసుకుని, నీడలో ఆరబెట్టుకోవాలి. ఆ తర్వాత వాటిని పొలంలో వేసుకుని, కలియదున్నితే పంటకు కావాల్సిన పోషకాలు నేల ద్వారా లభిస్తాయన్నారు. అలాగే పంటకు చీడపీడలు పట్టవని, ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ పాత్రుని వెంకటరమణ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటిస్తూ వ్యవసాయం చేస్తే సాగుకు అయ్యే పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

**బాడంగి:** మండలంలోని బ్రహ్మన్నవలస గ్రామ తోటల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్ఐ ఆర్.జయంతి సిబ్బందితో కలిసి సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకుని, అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.16,400 స్వాధీనం చేసుకున్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**రేగిడి:** మండలంలోని చాటాయవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఏవో జి.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలు అనుసరిస్తూ పంటలు సాగు చేస్తే ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు తవిటినాయుడు, కె.రమణ, సర్పంచ్ గోవిందరావు పాల్గొన్నారు.

## జూన్ 16 నుంచి రథోత్సవాలు

**రాజాం సిటీ:** పట్టణ పరిధిలోని తెలగవీధి-సత్యనారాయణపురం కాలనీలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జూన్ 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు రథోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఆలయ పదో వార్షికోత్సవం పురస్కరించుకుని, ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

## ఘనంగా తొలేళ్ల సంబరం

**బాడంగి:** మండలంలోని డొంకినవలస గ్రామంలో పైడితల్లి ఉత్సవాల్లో భాగంగా తొలేళ్ల సంబరం సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలను గద్దెలో నుంచి బయటకు తీసుకువచ్చి, రామమందిరం వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అమ్మవారు పూనిన మహిళలు వీధుల్లో నడవగా, ఆ తర్వాత మళ్లీ ఘటాలను గద్దెలోకి చేర్చారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

## అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు

**రాజాం సిటీ:** అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ హెచ్చరించారు. సోమవారం స్థానిక పట్టణంలో ఆకస్మిక దాడులు నిర్వహించిన పోలీసులు.. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని, సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో ఈ ఏడాది జనవరి నుంచి మే నెల వరకు 15 ట్రాక్టర్లను పట్టుకుని, 63టన్నుల ఇసుకను సీజ్ చేశామని తెలిపారు.

## స్ఫూర్తిప్రదాత రమాబాయి



రమాబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

**విజయనగరం:** స్త్రీల హక్కుల కోసం పోరాడిన మాత రమాబాయి నేటి మహిళలకు స్ఫూర్తిప్రదాత అని విజయనగరం జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బొంగ భానుమూర్తి అన్నారు. నగరంలోని రాక్‌పార్క్ ప్రాంతంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద మాతా రమాబాయి అంబేడ్కర్ 89వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భానుమూర్తి మాట్లాడుతూ.. రమాబాయి ఆలోచన స్ఫూర్తితో బీఆర్ అంబేడ్కర్ స్త్రీల హక్కుల కోసం పాటుపడ్డారని అన్నారు. రమాబాయి తన ముగ్గురు పిల్లలను కోల్పోయినప్పటికీ అంబేడ్కర్ విదేశీ విద్యకు సహకరించారని గుర్తుచేశారు. ఆమె గొప్పవ్యక్తిత్వాన్ని నేటి తరం వారంతా స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం పార్లమెంటు జై భీమ్‌రావు భారత్ పార్టీ అభ్యర్థి అరుణ్ కుమార్, స్వాతి, మధుసూదనరావు, మల్లన సంతోష్, మనీ, అలమండ సూరిబాబు, పట్నా గవరరాజు, వేమల వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## సుందరాడలో కార్డన్ సెర్చ్



తెర్లాం: సుందరాడలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు తదితరులు

**తెర్లాం:** మండలంలోని సుందరాడ గ్రామంలో బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు ఆధ్వర్యంలో తెర్లాం, రామభద్రపురం ఎస్ఐలతో పాటు, పోలీస్ సిబ్బంది సోమవారం సాయంత్రం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఇంటిని సందర్శించి, ఎటువంటి ధ్రువపత్రాలు లేని 4 ద్విచక్ర వాహనాలతో పాటు ఒక నాలుగు చక్రాల వాహనాన్ని సీజ్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు విడుదలవుతున్న నేపథ్యంలో ఎటువంటి తగాదాలు జరగకుండా చూడాలని, ఎవరైనా గొడవలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తెర్లాం ఎస్ఐ ఆర్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**రాజాం సిటీ:** పట్టణంలోని చాకలి, గొల్ల వీధుల్లో పోలీసులు సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, టౌన్ సీఐ డి.మోహనరావుల ఆధ్వర్యంలో ఆయా వీధుల్లో ఇంటింటా విస్తృత తనిఖీలు చేపట్టిన పోలీసులు.. ఎటువంటి ధ్రువపత్రాలు లేని 35 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి, తమకు సమాచారం అందించాలని అక్కడి వారికి పోలీసులు సూచించారు. సీజ్ చేసిన వాహనాలకు సంబంధించి, ఎవరైనా సరైన పత్రాలు చూపిస్తే వారి వాహనాలను వెనక్కి ఇచ్చేస్తామన్నారు. ఎటువంటి పత్రాలు లేని వాహనాలను మాత్రం కోర్టుకు తరలిస్తామన్నారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎవరూ ఎటువంటి గొడవలు పడవద్దని, శాంతియుత వాతావరణం ఉండేలా అందరూ సంయమనం పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ వై.రవికిరణ్, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



బొబ్బిలిలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

**బొబ్బిలి:** పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో పోలీసులు సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని పలు వాహనాలను పోలీసులు సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎవరూ ఎటువంటి గొడవలు పడవద్దని, ప్రశాంత వాతావరణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ ఎం.నాగేశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.



రాజాం సిటీ: సీజ్ చేసిన వాహనాలను చూపిస్తున్న పోలీసులు



రాజాం సిటీ: గొల్లవీధిలో కార్డన్ సెర్చ్ చేపడుతున్న పోలీసులు